


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -169-

**(13 ఏప్రిల్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**కొందరు** ఎంత పట్టుకు ప్రాకులాడుతున్నా, పూర్వకాలపు సామెతలు, సాంప్రదాయాలు, గుణగణాలూ, గార్హస్త్య ధర్మాలు చాలా తారుమారవుతున్న మాట నిజం. ఆయా కాల పరిస్థితుల్ని బట్టి ఆచార వ్యవహారాలు అమలులోకి వస్తూ ఉంటాయి. వాటి బలంతోనే అభివృద్ధి చెందుతూ వుంటాయి. అవి మారిపోగానే పరిస్థితులు కూడా మారిపోవడం సహజం.

పూర్వం పల్లెటూళ్ళలో ఏ యింటికి వెళ్ళినా కుండనిండా మజ్జిగ వుండేవి. దారినిపోయే వాళ్ళను కూడా పిలిచి గ్లాసుడు మజ్జిగ దాహమిచ్చేవారు. వేసవికాలంలో దారినపోయేవారు, వ్యాపారానికి వచ్చేవారూ, చిట్టచివరకు బిచ్చానికి వచ్చినవారూ – ఏ ఇంటికి వెళ్ళి "అమ్మా! కొంచెం దాహానికి దొరుకుతాయా" అనేవారు.

దాహమంటే మజ్జిగనే అర్ధం. దాహం మాట వినగానే "అయ్యో! నాయనా దానికేం? భగవంతుడిస్తున్నాడు. రవంత పాడి త్రాగండి నాయనా" అని ఎంతో ఆప్యాయంగా అందచేసేవారు.

కొందరు ఇల్లాళ్ళు ఎవరికన్నా మంచినీళ్ళు ఇవ్వబోతుంటే గృహస్థు చూసి "వాటిలో రెండు చల్ల చుక్కలు వేసి యివ్వవే నీ సొమ్మేం పోదు.. ఎట్లా వున్నా చల్లే. చింతగింజ మునక్కపోయినా చల్లే. పదిబొట్లు చిలికించినా చల్లే" అని భార్యను మందలిస్తూ వుండేవాడు.

ఇల్లాళ్ళు ప్రొద్దున్నే లేచి పాడి లేనివారిని పిలిచి "కాసిని మజ్జిగున్నాయి పట్టుకుపో. ఎండెక్కిన కొద్దీ పులుపెక్కుతాయి. తియ్యగా ఉండగానే త్రాగితే మంచిది" అని ఆహ్వానించేవాళ్ళు. మొత్తం మీద గ్రామంలో పాడిలేనివాళ్ళని ఒక మూల కనిపెడుతూనే వుండేవారు.

ఎవరైనా అతిథులు భోజనానికి వచ్చినప్పుడు చిక్కటి మజ్జిగ పోసి అన్నం పెట్టినప్పుడు అతిధి వెడుతూ వెడుతూ "మీ బోటి సజ్జనుల దర్శనమైనందుకెంతో సంతోషం" అనడం,

"అయ్యో నాయనా మజ్జిగ నీళ్ళలోనే మీకు సజ్జనత్వం గోచరించిందా. మీ మనస్సు మంచిది" అని గృహస్థు అనడం జరుగుతూ వుండేది.

ఆ గుమ్మంలో అడుగుపెట్టిన వాళ్ళకు కమ్మని మజ్జిగ త్రాగందే కదలనిచ్చేవారు కాదెప్పుడు. నిత్య చలివేంద్రం. భగవంతుడిచ్చిన పాడి పదిమందిదీ అనుకునేవారు ఆ యింట్లోవారందరూ" అని ఒక గృహాన్ని గురించి చెప్పుకోవడం చాలా చోట్ల వింటూవుండేవాళ్ళం.

పూర్వకాలంలో మజ్జిగ దానాల్ని గురించిన కథలు అనేకం వుండేవి. మజ్జిగ మహా ప్రసాదంగా భావించబడేది. పైగా మజ్జిగ మంచి ఆహారంగా కూడా భావించబడేది. ఒకరోజు ఎవరికైనా అన్నం దొరక్కపోయినా, చిక్కటి మజ్జిగ త్రాగి, కాలక్షేపం చేసేవారు. పిల్లవాడికి అన్నం పెట్టలేని తల్లి "చల్ల త్రాగిపోయి చదువుకోరా" అనడంకూడా కద్దు.

ఇప్పటి పరిస్థితులు ఆలోచిస్తే చాలా వ్యత్యాసం కనిపిస్తుంది ఆర్థిక మాంద్యంలో. దానధర్మాల విషయం ఆలోచించే అవకాశం లేకుండా పోయింది ఆర్థిక స్థోమతు కలవారు కూడా దాన ధర్మాలవల్ల వచ్చేదేమిటిలే అని చిల్లర డబ్బుల విషయంలో కూడా పట్టుబట్టడం జరుగుతోంది.

ఈ రోజు పల్లెటూళ్ళలో బస్తీలో దొరికినంతమాత్రం కూడా పాలూ, పెరుగూ దొరకడంలేదు. సూర్యోదయం అయిన తర్వాత ఊళ్ళో పాలచుక్క వుండడంలేదు. మజ్జిగ మాట అంతకంటె. పాల సంఘాల వారు పాలన్నిటినీ గేదల పొదుగుల్లోనుంచి కాగులలోకి పిండుకుంటున్నారు. ఎవరన్నా ఇంట్లో వాడిక కోసం కాసిని పాలు కాచి తోడు పెట్టుకుంటున్నారేమోగాని తక్కిన చోట్ల పాలదారులే కనిపించడంలేదు.

ఇటీవల మా మిత్రుడొకాయనకు బస్తీనుంచి పల్లెటూరికి బదిలీ అయింది . "పాలూ, పెరుగూ, కూరా, నారా ఇల్లూ వాకిలీ చౌకగా దొరుకుతాయి. మంచి గాలీ, నీరూ వుంటుంది" అని పాపం ఎంతో సంబరాలు పడ్డాడు. ముందు వెళ్ళి ఏర్పాట్లు చేసుకొని వద్దామని వెళ్ళాడు. పిల్లలు "బోలెడు పెరుగు, బోలెడు కూరలు" అని గంతులు వేయడం ప్రారంభించారు.ఆయనగారి సతీమణి కూడా సంతోషించింది పోనీ ,కొంచెం ఖర్చు తగ్గుతుంది సుఖంగా కూడా బ్రతకొచ్చు. బస్తీల్లో ఏ వస్తువు చూసినా అప్సరసలా నృత్యం చేస్తోంది" అని సంబరాలు పడింది పాపం.

ఆ గృహస్తు పల్లెటూరు వెళ్ళి చార్జీ తీసుకుని మూడోరోజున గ్రుడ్లు ఇంత లోతు చేసుకుని వచ్చాడు. ఆవిడ్ చూసి తెల్ల ముఖం వేసి "అదేమిటి ఇలా తయారయ్యారు మూడురోజులకే. శాండోలా తయారై వస్తారనుకున్నాం" అని ప్రశ్నించిందిట.

"ఇంకా నయం మూడురోజుల గ్రామవాసంలో "గామా"నై పోతాననుకున్నారా! ముందు పొయ్యి రాజెయ్యి పాలుంటే కాస్త కాఫీ కాచు. నులకమంచం ఇలా వాకిట్లో పడెయ్యి. కాసేపు చల్లగాలిలో పడుకుని తర్వాత చెపుతాను కథంతా" అన్నాడు.

ఆయనగారు కాఫీ తాగి ఏ అరగంటో పడి దొర్లిన తర్వాత లేచి కూర్చుని "ఇదుగో పొయ్యిమీద అత్తెసరు పడేసి బాగా విసురు. ఆకలవుతోంది. ఇవ్వాళ భోజనం చెయ్యాలా" అన్నారు.

"అందుకని? అన్నమే తినాలి?"

"ఎందుకని? అన్నం తినాలా?" అందిట ఆవిడ?

"తీరిక లేకపోయింది ఆఫీసు పనిలో. ఎందుకని వండుకోలా" అన్నారు ఆయన.

"ఏం హోటల్ లేదూ మరి పెద్ద ఆఫీసు పెట్టారుగా అక్కడ" అని ఆవిడ ప్రశ్న.

"అందరిలో నేనొక్కడినే చేతులు కాల్చుకున్నా. తక్కిన వారంతా కాపరాలు పెట్టుకున్నారు. నేను మధ్యాహ్నం ఒక బేడ మరమరాలు తిని మంచినీళ్ళు త్రాగి వూరుకున్నా" అన్నారాయన ఎంతో దీనంగా

"ఎవరింటికైనా భోజనానికి వెళ్ళకపోయారా? ఒక్క పూటకేం?" అంది ఆవిడ.

"ఇంకా నయం ఊళ్ళో ఉద్యోగం చేస్తూ ఎవరింటికి వెళ్ళను? నేనేం అతిధినా, అభ్యాగతినా?"

"పోనీ ఇన్ని పాలు త్రాగకపోయారా?" అంది ఆవిడ.

"పాలా! పల్లెటూళ్ళల్లో పాలెక్కడ ఉన్నాయి? అన్నీ బస్తికి వచ్చేస్తున్నాయి గ్రామంలో క్షీరమంతా సూర్యోదయం కాక ముందే పొలిమేరలు దాటుతోంది. ఒకచోటికి పాలు అమ్ముతారేమోనని కబురు పంపితే "మీ బస్తీల్లోలాగా ఇక్కడ దొరకవు బాబూ. వాడిక పెట్టుకుంటే ఎవరన్నా పోస్తారేమో? అది కూడా నమ్మకం లేదు" అన్నారుట.

"అయ్యో? మనం కాపురం పెడితే ఎలా మరి?" అంది ఆవిడ.

"వాడిక కుదరాలి మరి లేకపోతే కష్టమే? ఇళ్ళు కూడా ఎక్కడా లేవు. అద్దెలకిచ్చేవారు తక్కువ. ఒకరిద్దరు ఇచ్చారుగాని, అద్దె బస్తీలో కంటే ఏం తక్కువలేదు మీకే సౌఖ్యం తక్కువ. కరెంటు, గిరెంటు అన్నీ వున్నాయి. మంచిగాలి రెంటు తగ్గించమంటారే" అంటున్నారు అన్నారాయన.

"మరి ఏం చేద్దాం. మళ్ళీ ఇక్కడికే బదిలీ చేయించుకుంటారా?"

"మళ్ళీ బదిలీలా ఇది ఉద్యోగం.. ముచ్చటగా మూడు నిద్రలు చేసి చక్కాదాచడం కాదు. ఇక్కడినుంచే రోజూ వెడుతూ వుంటాను. క్యారియర్‌లో అన్నం పెట్టి ఇవ్వు. గ్యాంగ్ మేస్త్రీలాగానే వెళ్ళి వస్తూవుంటే. ఇస్త్రీ చీర నలక్కుండా నువ్విక్కడే కూర్చో" అన్నాడాయన.

Post your comments